సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 8 । జూన్ । 2023



నోరూరించే చేప రుచులు

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు, మృగశిర కార్తె సందర్భంగా గురువారం నుంచి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. 8లో



గురుకులాల గోడు పట్టదా..?

సొంత, అద్దె భవనాలు అందుబాటులో లేవనే సాకుతో ఓచోట మంజూరైన గురుకుల పాఠశాలలను మరోచోట నిర్వహిస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
43° / 29°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతాయి. ఎండలు మండుతాయి. రాత్రి వరకూ వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రామాలయంలో సంగీత లహరి



కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

భద్రాచలంటౌన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం రామాలయంలో సంగీత లహరి కార్యక్రమం నిర్వహించారు. ఆశ్వాపురం గ్రామానికి చెందిన కళాకారులు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది. కాగా, ఆలయంలో అందుతున్న సేవలు, సిబ్బంది వ్యవహారశైలిపై అధికారులు భక్తుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా మెరుగైన సేవల కోసం సలహాలు స్వీకరించారు.

వైభవంగా అష్టలక్ష్మీ పూజలు

సత్తుపల్లి: మండలంలోని నారాయణపురంలో శ్రీఅభయాంజనేయస్వామి, బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం వందలాదిగా హాజరైన మహిళలు అష్టలక్ష్మీ, కుంకుమ పూజ నిర్వహించారు. ఈ పూజలకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరుకాగా, అర్చకులు, నిర్వాహకులు స్వాగతం పలికారు. అలాగే, బేతుపల్లిలో నిర్మించిన శ్రీకృష్ణ ఆలయ ప్రతిష్ఠాపనోత్సవంలో ఎమ్మెల్యే సండ్ర పాల్గొని పూజలు చేశారు. ఈమేరకు శ్రీకృష్ణ నామస్మరణతో గ్రామం మార్మోగగా, భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

రైళ్లిక రయ్ రయ్ !



రద్దయిన రైళ్లు రేపటి నుంచి పునః ప్రారంభం

- కాజీపేట – కొండపల్లి సెక్షన్‌లో చకచకా మూడో లైన్ పనులు
- గంటల తరబడి ఆలస్యానికి ఇక చెక్
- ఉమ్మడి జిల్లా ప్రయాణికులకు ఊరట

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : ఉమ్మడి ఖమ్మం జిల్లా మీదుగా వెళ్లే పలు ప్రధాన రైళ్లు రేపటి నుంచి పట్టాలెక్కనున్నాయి. గతంలో తాత్కాలికంగా రద్దయిన రైళ్లన్నీ తిరిగి పునరుద్ధరించాల్సి ఉండగా.. మే నెలలో కురిసిన అకాల వర్షాలతో మూడో రైల్వే లైన్ పనులు సకాలంలో పూర్తి కాలేదు. దీంతో రైళ్ల రద్దు నిర్ణయాన్ని జూన్ 8 వరకు పొడిగిస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మరో రోజు పొడగింపుతో శుక్రవారం నుంచి యథావిధిగా రాకపోకలు సాగించనున్నాయి.

కొన్ని రైళ్లు తాత్కాలిక రద్దు..

చెన్నై – న్యూఢిల్లీ గ్రాండ్ ట్రంక్ రైల్వే మార్గంలో కీలకమైన కొండపల్లి(విజయవాడ) – కాజీపేట (వరంగల్) సెక్షన్ల మధ్య మూడో లైన్ నిర్మాణ పనులు గత ఐదేళ్లుగా కొనసాగుతున్నాయి. ఇందులో వరంగల్ జిల్లా నెక్కొండ – చింతల్‌పల్లి రైల్వే స్టేషన్ల మధ్య మూడో లైన్ నిర్మాణం పూర్తయింది. ఈ లైన్ మీదుగా రైళ్లు నడిపించాలంటే ప్రధాన మార్గాన్ని ఇంటర్ లాకింగ్ సిగ్నలింగ్ వ్యవస్థతో అనుసంధానం చేయాల్సి ఉంటుంది. ఇలా చేయాలంటే ప్రస్తుతం ఉన్న ఇంటర్ లాకింగ్ వ్యవస్థ మొత్తాన్ని తొలగించి కొత్త సిస్టమ్ ఇన్‌స్టాల్ చేయాలి. అప్పటివరకు ఈ రెండు స్టేషన్ల మధ్య రైళ్లు మాన్యువల్ సిగ్నల్‌పై ఆధారపడి నడిపించాల్సి ఉంటుంది. ఫలితంగా ఈ మార్గంలో అధిక ట్రాఫిక్‌తో రైళ్లు నడిపించడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో రైల్వేశాఖ ఉమ్మడి ఖమ్మం జిల్లా మీదుగా రాకపోకలు సాగించే కాకతీయ, సింగరేణి, శాతవాహన, బెళగావి, విజయవాడ – డోర్నకల్ – కాజీపేట, తిరుపతి – కాజీపేట రైళ్లను వివిధ దశల్లో మే 21 నుంచి జూన్ 7 వరకు రద్దు చేసింది. ఫలితంగా ఈ మార్గంలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించి, సిగ్నలింగ్ పనులు సజావుగా జరిగే వీలు కల్పించింది.

చివరి దశలో ఆటంకం..

మూడో లైన్ సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించి నెక్కొండ స్టేషన్ వద్ద నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తయ్యాయి. కానీ మేలో కురిసిన అకాల వర్షాల కారణంగా చింతల్‌పల్లి స్టేషన్ దగ్గర పనులకు ఆటంకం ఏర్పడింది. దీంతో ముందుగా నిర్ణయించిన జూన్ 7 లోపు అన్ని పనులు కానందున 'రైల్వే ట్రాఫిక్ బ్లాక్ 'ను జూన్ 8 వరకు పొడిగించాలని రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో ఈనెల 8న ఉమ్మడి ఖమ్మం జిల్లా మీదుగా ప్రయాణం సాగించాల్సిన రైళ్లు ఒకరోజు ఆలస్యంగా 9 నుంచి పట్టాల మీద పరుగులు పెట్టనున్నాయి. అయితే రైళ్ల పునఃప్రారంభంలో ఒకరోజు ఆలస్యానికి కారణాలనే వివరించిన రైల్వే శాఖ.. శుక్రవారం నుంచి రైళ్లు నడుస్తాయా లేదా అనే అంశంపై అధికారిక సమాచారం ఇంకా వెల్లడించలేదు.

ఇక నిర్ణీత సమయానికే..

గ్రాండ్‌ట్రంక్ మార్గంలో ఉన్న ఖమ్మం, మధిర స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగించే దూరప్రాంత వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మే 20 నుంచి జూన్ 6 వరకు దారి మళ్లించారు. ఇందులో విశాఖపట్నం – లోకమాన్య తిలక్ టెర్మినల్, షాలిమార్ – సికింద్రాబాద్, పటేల్‌నగర్ (ఢిల్లీ) – కోయంబత్తూర్, యశ్వంత్‌పూర్ – తుగ్లకాబాద్ (ఢిల్లీ), రోయాపురం (చెన్నై)– పటేల్‌నగర్ (ఢిల్లీ), ఓకా – విశ్వేశ్వరయ్య టెర్మినల్ (బెంగళూరు), షాలిమార్ – హైదరాబాద్ రైళ్లు ఉన్నాయి. జూన్ 9 నుంచి ఈ రైళ్లు పాత షెడ్యూల్ ప్రకారమే నడుస్తాయి. ఖమ్మం, మధిర, బోనకల్ తదితర స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగించే కృష్ణా, గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు కోచువెల్లి (తిరువనంతపురం)–కోర్బా, కోచువెల్లి –గోరఖ్‌పూర్ రైళ్లు సమయాల్లో మార్పుల కారణంగా నిర్ణీత సమయం కంటే రెండు నుంచి మూడు గంటల వరకు ఆలస్యంగా నడిచాయి. ఇకపై రెగ్యులర్ షెడ్యూల్‌లోనే ఈ రైళ్లు నడవనున్నాయి.

'సీతారామ'తో సస్యశ్యామలం



సాగునీటి ప్రాజెక్టుల కరదీపికలు ఆవిష్కరిస్తున్న విప్ రేగా, సీఈ శ్రీనివాసరెడ్డి తదితరులు

ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

అశ్వాపురం: గోదావరి జలాలను సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్ బ్యారేజీల ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం అవుతుందని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జలవనరుల శాఖ ఆధ్వర్యంలో బుధవారం బీజీ కొత్తూరులోని సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్ వద్ద నిర్వహించిన వేడుకలను రేగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. రూ.13057.98 కోట్లతో చేపట్టిన సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందని తెలిపారు. జిల్లాలో 1,63,770 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు రూ.6,333 కోట్లు ఖర్చు చేసిందని, త్వరలోనే సీతారామ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. సీతమ్మ సాగర్ బ్యారేజీ పనులు సైతం ముమ్మరంగా సాగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో జలవనరులశాఖ సీఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈలు శ్రీనివాస్, రాంబాబు, ఏఈలు రమేష్, రాజీవ్‌గాంధీ, గణేష్‌నాయక్, అశ్వాపురం, బూర్గంపాడు జెడ్పీటీసీలు సూదిరెడ్డి సులక్షణ, కామిరెడ్డి శ్రీలత, వైస్ ఎంపీపీ వీరభద్రం, బూర్గంపాడు పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి వనరులకు పెద్దపీట

ఎమ్మెల్యే వనమా, కలెక్టర్ అనుదీప్

చుంచుపల్లి: గత తొమ్మిదేళ్లుగా సాగునీటి వనరులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని విద్యానగర్‌లో బుధవారం సాగునీటి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ.. సాగునీటి రంగాభివృద్ధితోనే రాష్ట్ర పునర్నిర్మాణం ఆధారపడి ఉందని గ్రహించిన సీఎం కేసీఆర్.. ఈ రంగానికి అత్యంత ప్రాధాన్యమిచ్చారని చెప్పారు. సీతారామ, సీతమ్మ సాగర్‌తో పాటు అనేక చిన్న తరహా చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు అనేక చెరువులపై మినీ ట్యాంకుబండ్‌లు నిర్మిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు తర్వాత సాగునీటి రంగంలో అనేక విజయాలు సాధించామన్నారు. జిల్లాలో మొత్తం 2,849 చెరువులున్నాయని, వాటిలో మొదటి దశలో రూ.94.38 కోట్లతో 558 చెరువులను, రెండో దశలో రూ. 137.80 కోట్లతో 636 చెరువులు, 3వ దశలో రూ.60 కోట్ల వ్యయంతో 279 చెరువులు అభివృద్ధి చేసినట్లు వివరించారు. తద్వారా నీటి సామర్థ్యం పెరిగి భూగర్భ జలాలు పెరిగాయని చెప్పారు. 2014కు ముందు సగటు భూ గర్భ జల మట్టం 6.196 మీటర్లు ఉండగా, మిషన్ కాకతీయ చేపట్టిన తదుపరి 7.93 మీటర్లకు పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, ఇరిగేషన్ ఈఈ అర్జున్, చుంచుపల్లి సర్పంచ్ గోవింద్, ఎంపీపీలు బాదావత్ శాంతి, సోనా, విజయలక్ష్మి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వనమా, కలెక్టర్ అనుదీప్ తదితరులు

ఏరియా ఆస్పత్రికి పురస్కారం భేష్

కలెక్టర్ అనుదీప్, పీఓ గౌతమ్ అభినందన

సూపర్‌బజార్(కొత్తగూడెం)/భద్రాచలం: భద్రాచలం ఆస్పత్రికి పురస్కారం ప్రకటించడం హర్షణీయమని కలెక్టర్ అనుదీప్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు అన్నారు. ఆస్పత్రికి పురస్కారం ప్రకటించిన నేపథ్యాన వైద్య బృందాన్ని బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో పీఓ, ఐడీఓసీలో కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే ఏజెన్సీ ప్రాంతాల్లో భద్రాచలం ఆస్పత్రి పురస్కారం సాధించటం, జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో ఆదివాసీలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. గతంలోనూ కాయకల్ప, నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ సర్టిఫికెట్ రాగా, ప్రసవాల్లో పలుమార్లు రాష్ట్రస్థాయి అవార్డులు సాధించడం గర్వకారణమని చెప్పారు. ఈ అవార్డు ద్వారా ఏటా అందే రూ.3 లక్షలతో అన్ని సౌకర్యాలు సమకూర్చుకోవాలని తెలిపారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, డాక్టర్ రవిబాబునాయక్ ఆస్పత్రిలో చిన్నపిల్లలకు అందుతున్న వైద్యాన్ని పరిశీలించాక పురస్కారం ప్రకటించారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, ఆర్ఎంఓలు రాజశేఖర్‌రెడ్డి, చైతన్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ రాముడు, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ శ్రుతి తదితరులు పాల్గొన్నారు.



పీఓ గౌతమ్‌తో వైద్యాధికారులు, ఉద్యోగులు

10న జాతీయ లోక్ అదాలత్

కొత్తగూడెంటౌన్: ఈనెల 10వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి తెలిపారు. జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీమా కంపెనీ ప్రతినిధులు తమ కేసులను లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. మోటార్ వాహన ప్రమాద బాధితుల కేసులలో కక్షిదారులకు న్యాయం చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ పడటం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటాయని అన్నారు.

బేకరీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

అశ్వాపురం: మణుగూరు మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఓ బేకరీలో ఖమ్మం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బుధవారం తనిఖీలు చేపట్టారు. మెజిస్ట్రేట్ మీసాల వెంకటేశ్వర్లు భద్రాచలం నుంచి మణుగూరు వెళ్తూ అశ్వాపురంలోని ఓ బేకరిలో డాల్డా కొనుగోలు చేయగా దుర్వాసన వచ్చింది. నాణ్యత సరిగా లేదని గమనించిన మెజిస్ట్రేట్ పోలీసుల ద్వారా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఖమ్మం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బేకరీలో నమూనాలు సేకరించారు. పరీక్షల అనంతరం వచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని కిరణ్‌కుమార్ తెలిపారు.

20 లోపు దరఖాస్తు చేసుకోండి

కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): చేతివృత్తుల వారు ఆర్థిక సాయం కోసం ఈనెల 20 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. కుల, చేతివృత్తులపై ఆధారపడి జీవించే బలహీన వర్గాల వారికి రూ.లక్ష ఆర్థిక సాయంపై బీసీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమ శాఖాధికారులతో బుధవారం ఐడీఓసీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం బీసీ కుల వృత్తులు, చేతివృత్తులు చేసుకుని 18 – 55 ఏళ్ల మధ్య వయసు వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించిందని, కుటుంబంలో ఒకరికి మాత్రమే మంజూరవుతుందని చెప్పారు. https://tsobmmsbc.cgg.gov.in ఆన్‌లైన్‌లో ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షలకు మించి ఉండకూడదన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్‌కార్డు, ఆహారభద్రత కార్డు, పాస్ ఫొటో, బ్యాంకు పాస్‌బుక్‌ను దరఖాస్తుతో పాటు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని వివరించారు. సమావేశంలో బీసీ సంక్షేమాధికారులు ఇందిర, విజయలక్ష్మి, మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు, ఎస్సీ అభివృద్ధి అధికారి అనసూర్య, మహిళా శిశు సంక్షేమాధికారి సబిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

10లోపు పేర్లు నమోదు చేసుకోవాలి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది దినోత్సవాల్లో భాగంగా ఈనెల 11న ఐడీఓసీలో కవి సమ్మేళనం, పాటల పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ అనుదీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనంలో పద్య, వచన, కవితల పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొన దలచిన వారు ఈనెల 10వ తేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ అస్తిత్వం, ప్రగతి ప్రతిబింబించేలా తెలుగు, ఉర్దూ భాషల్లో పద్య, వచన, కవితల పోటీలు ఉంటాయని తెలిపారు. 11వ తేదీ ఉదయం 10 గంటలకు ఐడీఓసీ కార్యాలయంలో కవి సమ్మేళనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. విజేతలకు మెమెంటో, శాలువాలతో సత్కారాలు ఉంటాయని వివరించారు. కవులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. 9398921276, 7659993735 నంబర్లకు వాట్సాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోండి

భద్రాచలం: బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులు ప్రభుత్వం అందజేస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుంటూ చదువులో రాణించాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకుల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ అన్నారు. జిల్లాలోని మూడు బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో 3, 5, 8 తరగతుల్లో ప్రవేశాలకు బుధవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో విద్యార్థులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. 115 సీట్లను కేటగిరీల వారీగా బాలబాలికలకు కేటాయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కమిటీ సభ్యులు, తల్లిదండ్రుల సమక్షంలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఎంపిక చేశామని తెలిపారు. 963 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరిలో 3వ తరగతిలో 57 సీట్లకుగాను లంబాడా తెగకు చెందిన బాలికలకు 5, జనరల్‌లో బాలురు, బాలికలకు 11 సీట్లు, కోయ తెగల బాలికలకు 11 సీట్లు, జనరల్‌లో 22 సీట్లు, నాయకపోడు తెగల బాలికలకు ఒకటి, జనరల్‌లో రెండు, కొండరెడ్ల బాలికలకు రెండు, జనరల్‌లో మూడు సీట్లకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు వివరించారు. ఐదో తరగతిలో లంబాడా తెగ బాలికలకు మూడు, జనరల్‌లో 5, కోయ తెగలో బాలికలకు ఆరు, జనరల్ 11, నాయకపోడు తెగలో జనరల్‌లో ఒకటి, కొండరెడ్ల తెగలో బాలికలకు ఒకటి, జనరల్ రెండు సీట్లు భర్తీ చేశామని వెల్లడించారు. 8వ తరగతిలో లంబాడా తెగలో బాలికలకు మూడు, జనరల్‌లో ఆరు, కోయ తెగలో బాలికలకు ఆరు, జనరల్‌లో 11, నాయకపోడు తెగలో జనరల్‌లో ఒకటి, కొండరెడ్ల తెగలో బాలికలకు ఒకటి, జనరల్‌లో రెండు సీట్లు లాటరీ పద్ధతిన ఎంపిక చేశామని వివరించారు. ఎంపికైన బాలబాలికలకు ఈనెల 15న కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య, భద్రాచలం, దమ్మపేట ఏటీడీఓలు నరసింహారావు, చంద్రమోహన్, గురుకుల విభాగం పర్యవేక్షకుడు కృష్ణార్జున, డీడీ ప్రమీల బాయి, రంగయ్య, రమణమూర్తి, ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఎంపిక చేస్తున్న అధికారులు

'మిషన్'తో మహర్దశ

- చెరువుల పునరుద్ధరణతో సాగుకు ఊతం
- రిజర్వాయర్లను తలపిస్తున్న చెక్ డ్యామ్‌లు
- జిల్లా వ్యాప్తంగా పెరిగిన భూగర్భ జలాలు
- నేడు ఊరూరా చెరువుల పండుగ



జలకళ సంతరించుకున్న కిన్నెరసాని వాగు

పాల్వంచరూరల్/బూర్గంపాడు: ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని చెరువులకు మిషన్ కాకతీయతో మహర్దశ పట్టింది. పూడిక చేరి, కట్టలు తెగి, అలుగులు కొట్టుకుపోయి నిల్వ నీరు లేకుండా వట్టిపోయిన చెరువులు ప్రస్తుతం జలకళ సంతరించుకున్నాయి. బీళ్లు పడిన భూములు సైతం నేడు సాగులోకి వచ్చాయి. జిల్లాలో 2,274 చెరువులు ఉండగా వాటి పరిధిలో 1,28,854 హెక్టార్ల ఆయకట్టు ఉంది. మిషన్ కాకతీయ పథకం ద్వారా రూ.362.77 కోట్ల వ్యయంతో 1,660 చెరువులను పునరుద్ధరించారు. తద్వారా నీటి నిల్ల సామర్థ్యం 8.733 ఎంసీఎఫ్‌టీ నుంచి 11.0331 ఎంసీఎఫ్‌టీకి పెరిగింది. వీటితో పాటు వాగుల్లో చెక్ డ్యామ్‌లు నిర్మించి భూగర్భ జలాల పెంపునకు కృషి చేశారు. ప్రస్తుతం మండు వేసవిలోనూ చెక్ డ్యామ్‌లు రిజర్వాయర్లను తలపిస్తున్నాయి. కాగా, తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా చెరువుల పండుగ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఐదు విడతల్లో అభివృద్ధి..

మిషన్ కాకతీయ పథకంలో ఐదు విడతలుగా చెరువులు, కుంటలను అభివృద్ధి చేశారు. ఏళ్ల తరబడి పూడుకపోయిన చెరువుల్లో మట్టి తీయడంతో పాటు వాటి లోతు పెంచి నీరు ఎక్కువ నిల్వ ఉండేలా చర్యలు తీసుకున్నారు. చెరువు కట్టలను బలోపేతం చేసి తూములు, అలుగులు నిర్మించారు. పూడిక మట్టిని పొలాల్లో పోయడంతో భూములు కూడా సారవంతమయ్యాయి. భూగర్భ జలాల పెంపుతో బావులు, బోర్లలో నీరు పుష్కలంగా అందుతోంది. యాసంగిలోనూ ఆరుతడి పంటలు, కూరగాయల సాగుకు ఢోకా ఉండడం లేదు. చెరువులు నిండడంతో చేపల పెంపుతో మత్స్యకారుల కుటుంబాలకు సైతం జీవనోపాధి మెరుగుపడుతోంది.

చెక్‌డ్యామ్‌లతో జలకళ..

వాగుల ద్వారా వృథాగా పోతున్న నీటిని నిల్వ చేసి భూగర్భజలాలను పెంపొందించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి చెక్‌డ్యామ్‌లు నిర్మించింది. జిల్లాలోని కిన్నెరసాని, ముర్రేడు, పాములేరు, ముస్నేరు, పెదవాగు, గుండేటివాగు తదితర వాగుల్లో చెక్ డ్యామ్‌ల నిర్మాణంతో జలకళ సంతరించుకుంది.

సాగునీటి సమస్య తీరింది



పాల్వంచ మండలంలోని నాగారం – రంగాపురం మధ్య కిన్నెరసాని వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణంతో ఆయకట్టు రైతులకు ప్రయోజనం కలుగుతోంది. ఇటీవల కురిసిన వర్షానికి చెక్‌డ్యామ్ నిండడంతో బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పెరిగాయి. ఈ ఏడాది రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతుంది.

– నాగయ్య, రైతు, నాగారం

రెండు పంటలు సాగవుతాయి



సోములగూడెం వద్ద కిన్నెరసాని వాగు సమీపంలో నాకు మూడెకరాల పొలం ఉంది. ప్రతి సంవత్సరం బూడిద వాగు నీటిపై ఆధారపడి పంటలు పండిస్తున్నాం. ఒక పంటకు మాత్రమే నీరందేది. ఇప్పుడు కిన్నెరసానిపై చెక్‌డ్యామ్ నిర్మాణంతో బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో రెండు పంటలు సాగు చేస్తున్నాం.

– గంగిశెట్టి వెంకయ్య, సోములగూడెం

వేసవిలోనూ సమృద్ధిగా నీరు



వాగుల ద్వారా వృథాగా పోతున్న నీటిని నిల్వ చేసి రైతులు సాగుకు వినియోగించుకునేలా ప్రణాళికాబద్ధంగా జిల్లాలో పలు చెక్‌డ్యామ్‌లు నిర్మించాం. తద్వారా భూగర్భ జలాల పెరిగాయి. వేసవిలో కూడా జలకళ సంతరించుకుంటున్నాయి. ఎండా కాలంలో పంటల సాగుకు పుష్కలంగా నీరందుతోంది. బోర్లు, బావుల్లోనూ నీటి నిల్వలు పెరిగాయి.

– శ్రీనివాసరెడ్డి, జలవనరుల శాఖ సీఈ

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిబూడిదైన ఇల్లు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని శుభాష్‌నగర్ కాలనీకి చెందిన తోకల ఫకీరయ్య ఇల్లు బుధవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చేలోపే ఇల్లు పూర్తిగా కాలిబూడిదైంది. మంటలు అంటుకున్న సమయంలో ఇంట్లో చిన్నారి ఉన్నట్లు గమనించిన స్థానికులు వెంటనే ఆ చిన్నారికి రక్షించారు. వృత్తిరీత్యా ఫకీరయ్య రోజువారీగా చింతపండు ఇతర వస్తువులు విక్రయిస్తూ జీవితం సాగిస్తున్నాడు. ఇల్లు దగ్ధం కావడంతో ఇంట్లోని నగదు, బంగారం దగ్ధమయ్యాయి. మొత్తం రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. భద్రాచలం సీఐ నాగరాజురెడ్డి, టౌన్ ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేశారు.

లైంగికదాడికి యత్నం కేసులో మూడేళ్ల జైలు

కొత్తగూడెంటౌన్: బాలికపై లైంగికదాడికి యతి్నంచిన కేసులో పాల్వంచ నవభారత్‌కు చెందిన గూడూరు శేషగిరిరావుకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.21 వేల జరిమానా విధిస్తూ బుధవారం కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి, పోక్సో జడ్జి ఎం.శ్యాంశ్రీ తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. 2021 ఏప్రిల్ 11వ తేదీన నవభారత్ మైదానికి ఆడుకునేందుకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగివస్తూ ఏడుస్తుండటంతో తల్లికి అనుమానం వచ్చింది. ఏం జరిగిందని అడగగా వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న గూగూరు శేషగిరిరావు లైంగికదాడికి యత్నించాడని తెలిపింది. వెంటనే తన భర్త సాయంతో పాల్వంచ టౌన్ పోలీసులకు శేషగిరిరావుపై ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. న్యాయమూర్తి 14 మంది సాక్షులను విచారించి నిందితుడు శేషగిరిరావుపై నేరం రుజువైనందున మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.21 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఇన్‌చార్జ్ పీపీ పీవీడీ లక్ష్మి వాదించగా కోర్టు లైజన్ ఆఫీసర్ హరగోపాల్, కోర్టు కానిస్టేబుల్ గంగావత్ సహకరించారు.

ఇప్పసారా స్వాధీనం

టేకులపల్లి: పంట పొలంలో ఇప్ప సారా కాస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు సారాను ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. మండలంలోని కొప్పురాయి పంచాయతీ కొత్తూరుకు చెందిన ఇర్ప పాపయ్య కిష్టారంలోని పొలంలో ఇప్ప సారా కాస్తున్నారనే సమాచారంతో తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, పాపయ్యను ఎక్సైజ్ శాఖాధికారులకు అప్పగించామని ఎస్‌ఐ బి.రంజిత్‌కుమార్ తెలిపారు.

నోరూరించే చేప రుచులు

నేటి నుంచి జిల్లాలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

- కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహణ
- సుమారు 15 రకాల రుచులను అందించనున్న మహిళా సంఘాలు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట ఈ నెల 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనుంది. అందులో భాగంగా ఈ నెల 8న మృగశిర కార్తె సందర్భంగా చెరువుల పండుగను నిర్వహిస్తోంది. చెరువులు లేనిచోట ఇతర ప్రాంతాల నుంచి పలు రకాల చేపలు, రొయ్యలు తెప్పించి మత్స్య పారిశ్రామిక మహిళా సహకార సంఘాల ద్వారా సుమారు 15 రకాలను తయారు చేయించి విక్రయించనున్నారు.

మహిళా సంఘాల ఆర్థిక స్వాలంబనకే..

ఆధునిక సమాజంలోని బిజీ షెడ్యూళ్ల కారణంగా చాలామంది జంక్ ఫుడ్, రెడీమేడ్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. కొందరికి ఆరోగ్యకరమైన ఫుడ్ తీసుకోవాలని ఉన్నప్పటికీ పని ఒత్తిడిలో కుదరడం లేదు. చేపల రుచులు చాలా మందికి తెలియదు. తెలిసినా వాటిలో ఉండే ముల్లుల మూలంగా చేపలకు దూరంగా ఉంటారు. మరికొంత మంది రొయ్యలను ఇష్టపడతారు కానీ, చేపల రుచి తెలిసిన వారు మాత్రం ఇతర వంటకాల జోలికిపోరు.

రోజుకు వెయ్యి కిలోల చేపలు

మూడు రోజుల పాటు మహిళా సంఘాలు తయారు చేసే సుమారు 15 రకాల వంటకాలకు దాదాపు 1000 కిలోల చేపలను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించనున్నారు. చేప పచ్చడి, రొయ్య పచ్చడి, ఫిష్ సమోస, ఫిష్ సూప్స్, ప్రాన్స్ బిర్యాని, ప్రాన్స్‌పకోడి, ఫిష్ బర్గర్స్, ఫిష్ పకోడి, ఫిష్ కట్‌లెట్స్, ఫ్రైడ్ ప్రాన్స్, అపోలో ఫిష్, ఫిష్ ఫింగర్, ప్రాన్స్ బట్టర్, ఫిష్ మంచూరియా వంటి వంటకాలు చేయనున్నారు.



చేపల పులుసు



ఫిష్ వడ

జిల్లాలో 743 చెరువులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సహజ నీటి వనరులపై ఆధారపడి 60 సహకార సంఘాలున్నాయి. వాటిలో మూడు జనరల్ సొసైటీలు (కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వాపురం) కాగా మరో నాలుగు మహిళా సంఘాలు. మిగిలినవి ప్రాథమిక గిరిజన మత్స్య సహకార సంఘాలుండగా వాటిలో సుమారు 2,736 మంది సభ్యులున్నారు. వారు జిల్లాలోని 89 పెద్ద చెరువులు, 653 చిన్న చెరువులలో చేపల షికారు చేసి జీవనం సాగిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ 743 చెరువులకు గాను 177.42 లక్షల చేప పిల్లలను అందిస్తోంది.

చేపలు తింటే ఆరోగ్యమే..

చేపలు తినటం మూలంగా కంటి చూపు మెరుగ్గా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. చేపలు తినడం వల్ల ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్ (ఆమ్లాలు)లు దేశంలో ఉత్పత్తి అయ్యి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. పెద్దపేగు, మలద్వారా కేన్సర్ ముప్పు తప్పుతుంది. విటమిన్-ఏ, డీ, ఈ, కేతో పాటు పాస్ఫరస్ శరీరానికి అందుతాయి. రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుతాయి. ఎముకలు దృఢంగా ఉంటాయి. మూత్ర పిండాల పనితీరు మెరుగవుతుంది. గర్భిణులు చేపలు తింటే కడుపులోని పిండానికి మంచి ప్రొటీన్లు అందుతాయి.

అవగాహన కోసమే చేపల పండుగ



చేపల వంటకాలు, వాటి ఉపయోగాలపై మహిళా సంఘాలకు మత్స్య శాఖ ఆధ్వర్యంలో పలు కేంద్రాల్లో శిక్షణ ఇప్పించాం. వాటిలో ప్రధానంగా కొత్తగూడెం, రొంపేడు సంఘాలకు చెందిన సుమారు 12 మందికి శిక్షణ ఇప్పించాం. వారితో పాటు ఎస్‌హెచ్‌జీ డెయిరీ, వెటర్నరీ సభ్యులు సుమారు 50 మంది మహిళలు వంటకాలు చేయనున్నారు. సుమారు 10 కౌంటర్లు ఏర్పాటు చేసి వంటకాలను పట్టణ ప్రజలకు అందించనున్నారు.

– బానోత్ వీరన్న, జిల్లా మత్స్యశాఖాధికారి

శభాష్.. నరేందర్



ఆయన పుట్టుకతో పూర్తి అంధుడు. చూపు లేదని ఏనాడూ కుంగిపోలేదు. ఎంచుకున్న లక్ష్యం వైపు పట్టుదలతో అడుగులు వేశాడు. కళాజాతాల్లో డప్పు కళాకారుడిగా రాణిస్తున్నాడు. తెలంగాణ సాంస్కృతిక సారధి సభ్యుల్లో ఒకడిగా అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రశంసలు అందుకుంటున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కొత్తగూడెం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ప్రదర్శనల్లో ఆకర్షణగా నిలుస్తున్న డప్పు కళాకారుడు మిట్టపల్లి నరేందర్‌ను అందరూ శభాష్ అని కొనియాడుతున్నారు. తెలంగాణ ఉద్యమ పాటలకు వేదికలపై డప్పు కొడుతూ జిల్లా కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే వనమా తదితరుల నుంచి మన్ననలు పొందాడు. – చుంచుపల్లి



నరేందర్‌ను చేతితో పట్టుకొని స్టేజీ వరకు నడిపిస్తున్న తోటి కళాకారులు (ఇన్‌సెట్) విద్యానగర్‌లో జరిగిన దశాబ్ది వేడుకల్లో డప్పు కొడుతున్న నరేందర్

రుణం ఉందంటూ పింఛన్ డబ్బు ఇవ్వట్లేదు..

ఇల్లెందురూరల్: బ్యాంకులోరుణం బకాయి ఉందంటూ ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ నగదును బ్యాంకు అధికారులు అడ్డుకుంటున్నారని మండలంలోని పోలారం గ్రామానికి చెందిన బాదావత్ భగవాన్ వాపోయారు. ఈ మేరకు బుధవారం అయన ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. గతంలో తాము బ్యాంకులో పంట రుణం తీసుకోగా, కొంత చెల్లించినా ఇంకా రూ.7 వేలే బకాయి ఉన్నామని తెలిపారు. దీనిని సాకుగా చెబుతూ మూడు నెలలుగా పింఛన్ తీసుకోకుండా ఇబ్బంది పెడుతున్నందున తమ సమస్యపై దృష్టి సారించాలని కోరారు. తనతో పాటు గ్రామంలో చాలామంది ఇదే సమస్య ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. స్పందించిన ఎంపీడీఓ బాలరాజు కలెక్టర్ జత చేసిన ఆదేశాలను జత పరుస్తూ పింఛన్ విడుదల చేయాలని కోరుతూ బ్యాంకు అధికారులకు లేఖ పంపారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న భగవాన్

జ్వరాల నియంత్రణకు ప్రత్యేక బృందాలు

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి

కరకగూడెం: మండలంలోని ఎస్సీకాలనీలో ప్రబలుతున్న విషజ్వరాల పట్ల అధికారులు అప్రమత్తమయ్యారు. 15 రోజుల వ్యవధిలో ముగ్గురు మృత్యువాత పడటంతో జ్వరాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ఇదివరకే గ్రామాల్లో వైద్యశిబిరం నిర్వహిస్తుండగా బుధవారం కలెక్టర్ అనుదీప్ ఆదేశాలతో మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి మోకాళ్ల వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి పుష్పలత ఆధ్వర్యంలో సుమారు 10 మంది సభ్యులు 2 బృందాలుగా గ్రామంలో పర్యటించి జ్వరాలకి గల కారణాలను విశ్లేషించారు. జ్వర పీడితుల ఇంటింటి సర్వే నిర్వహించి వారి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే శానిటైజేషన్, సరైన సమయంలో చికిత్స తీసుకోవడం, డీహైడ్రేషన్ కాకుండా ఓఆర్ఎస్ తీసుకోవడం, దోమలు కుట్టకుండా దోమతెరలను వాడడంతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. అంతకు ముందు డిప్యూటీ డీఎంహెచ్ఓ రాజ్‌కుమార్ సదరు కాలనీలో పర్యటించి వైద్య శిబిరాలను తనిఖీ చేశారు. రాత్రివేళలో కాలనీలో పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి కారం మధు, స్థానిక సర్పంచ్ ఊకే రామనాథం, ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న ప్రత్యేక వైద్య బృందం

విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలు

అశ్వారావుపేటరూరల్: విద్యుదాఘాతానికి గురై ట్రాన్స్‌కో సంస్థలో ప్రైవేటు హెల్పర్‌గా పనిచేస్తున్న ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పేరాయిగూడెం గ్రామానికి చెందిన గాలంకి అశోక్ కొంతకాలంగా ప్రైవేట్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే బుధవారం నారంవారిగూడెం విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం బుధవారం ఎల్‌సీ తీసుకున్నాడు. కాగా పొరపాటున పక్కనే ఉన్న దమ్మపేటకు వెళ్లే విద్యుత్ స్తంభాన్ని ఎక్కి విద్యుదాఘాతానికి గురై గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.



గాయపడిన వ్యక్తి

రెండు బైక్‌లు ఢీ

దమ్మపేట: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఒకదానికొకటి ఢీకొనడంతో యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని మందలపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మందలపల్లి గ్రామంలోని మీసేవ కేంద్రం సమీపంలో ఎదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో దమ్మపేట నుంచి మందలపల్లి వైపునకు బైక్‌పై వస్తున్న గుర్తుతెలియని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో క్షతగాత్రుడిని 108లో అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సైబర్ క్రైమ్ కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఓ కాలనీకి చెందిన అపూర్వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో నివాసం ఉండే తన స్నేహితురాలికి కొరియర్ ద్వారా భద్రాచలం దేవస్థానం తలంబ్రాలను పంపించాలనుకుంది. ఈ క్రమంలో ఆ కొరియర్‌కు సంబంధించిన డబ్బులు కడుతున్న సమయంలో తన ఖాతా నుంచి తెలియకుండా రూ.5 వేలు మాయం అయినట్లుగా గుర్తించి, బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ నాగరాజురెడ్డి కేసు నమోదు చేశారు.

నలుగురు నిందితుల గుర్తింపు

సుజాతనగర్: సుజాతనగర్‌లో సంచలనం సృష్టించిన బంగారు దుకాణంలో చోరీ ఘటనలో నలుగురు వ్యక్తులను పోలీసులు ఇప్పటికే గుర్తించినట్లుగా తెలుస్తోంది. ఈ ఆపరేషన్‌లో మొత్తం ఐదుగురు వ్యక్తులు ఉండొచ్చనే నిర్ధారణకు పోలీసులు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. వివిధ కోణాల్లో సేకరించిన సమాచారం ఆధారంగా ప్రత్యేక పోలీసు బృందాలు దుండగుల కోసం గాలిస్తున్నారు. బంగారం కొల్లగొట్టిన దుండగులు ఉత్తరప్రదేశ్‌కు రాష్ట్రానికి చెందిన వారై ఉంటారని తొలుత భావించారు. కానీ, దొరికిన ఆధారాలను బట్టి వీరంతా నేపాల్ వాసులై ఉండొచ్చనే అనుమానం సైతం వ్యక్తమవుతోంది. ఈ నెల 1వ తేదీన రాత్రి సుమారు 12 గంటల సమయంలో చోరీ జరగగా ఆ విషయం 4వ తేదీన వెలుగులోకి వచ్చింది. చోరీ జరిగిందనే విషయం తెలిసేలోగానే రెండు రోజులు గడిచిపోయాయి. ఈ లోగా నిందితులు ఉడాయించడంతో వారి కోసం విస్తృతంగా గాలించాల్సిన పరిణామాలు ఏర్పడ్డాయి.


ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన యాష్ ట్యాంకర్

- యువతి దుర్మరణం

పాల్వంచ: ద్విచక్రవాహనాన్ని యాష్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఓ యువతి దుర్మరణం చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మణుగూరుకు చెందిన సింగరేణి ఉద్యోగి గౌస్ కూతురు షేక్ సీమ (23) బంధువు షేక్ మొహమ్మద్ పాషాతో కలిసి ద్విచక్రవాహనంపై కొత్తగూడెంలోని తన అక్క సిమ్రాన్ దగ్గరకు బయలుదేరింది. ఈ క్రమంలో పాల్వంచ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని కేటీపీఎస్ నుంచి బూడిదలోడ్‌తో కొత్తగూడెం వైపు వెళ్తున్న యాష్ ట్యాంకర్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ క్రమంలో సీమ లారీ వెనుక టైర్ల కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. శరీర భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. పాషా కుడివైపు పడటంతో స్వల్పగాయాలయ్యాయి. సీమకు పాషాతోనే జరిపించాలని కుటుంబ సభ్యులు అనుకున్నారు. ఈ తరుణంలో ఇద్దరూ కలిసి వెళ్తుండగా అతడి కళ్లెదుటే సీమ మృతి చెందడంతో తీవ్ర విషాదంలోకి వెళ్లాడు. మృతురాలి తండ్రి గౌస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

వడదెబ్బతో పంపు ఆపరేటర్ మృతి

అశ్వారావుపేటరూరల్: విధి నిర్వహణలో ఉన్న ఓ గ్రామ పంచాయతీ పంపు ఆపరేటర్ బుధవారం మధ్యాహ్నం వడదెబ్బకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన పోకల నాగరాజు (55) మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సంత మార్కెట్ సమీపంలోని వాటర్ ట్యాంకు వద్ద పంప్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మోటారును ఆన్ చేసే క్రమంలోనే వడదెబ్బకు గురై అక్కడికక్కడే సొమ్మసిల్లి పడిపోయాడు. గమనించిన ప్రయాణికులు ఆస్పత్రికి తరలించేలోపే పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. పంప్ ఆపరేటర్ మృతి పట్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ అట్టం రమ్య, ఈఓ హరికృష్ణ, ఉపసర్పంచ్ రేమళ్ల కేదార్‌నాథ్, తోటి కార్మికులు సంతాపం వ్యక్తం చేశారు.



నాగరాజు (ఫైల్)

క్షుద్ర పూజల అనుమానంతో వృద్ధురాలిపై దాడి

అశ్వారావుపేటరూరల్: క్షుద్రపూజల అనుమానంతో ఓ వృద్ధురాలిపై దాడికి పాల్పడిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ బి.రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని మద్దికొండ గ్రామానికి చెందిన కొర్సా వెంకటనర్సమ్మ కొద్ది రోజులుగా ఇంట్లో పూజలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఇంటి పక్కనే ఉన్న మెడియం రంగారావు కుటుంబీకులు అనారోగ్యానికి గురి కాగా, వృద్ధురాలు పూజలు చేయడం వల్లే ఇలా జరుగుతోందనే అనుమానంతో ఆమెతో గొడవ పడి కర్రతో దాడి చేసి చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో వృద్ధురాలి కుమారుడు కొర్సా బుచ్చిరాజు చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుతో రంగారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరివేసుకొని వ్యక్తి మృతి

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కొత్తపేటకాలనీకి చెందిన కనిసెట్టి సాంబశివరావు (34) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. సాంబశివరావు కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. మానసికంగా కుంగిపోయాడు. ఇటీవల అతడి భార్య, ఇద్దరు పిల్లలు గుంటూరులోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో సాంబశివరావు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని గడ్డి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జానీ, ధన్‌రాజ్, ప్రవీణ్, పోసం వెంకటేశ్వర్లుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ బుధవారం తెలిపారు. తనను మాట్లాడటం కోసం పిలిచిన నలుగురు వ్యక్తులు కులం పేరుతో దూషించడంతోపాటు భౌతికంగా దాడిచేశారని శ్రీనివాస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.







ఉద్యోగికి 'గ్యారంటీ' భరోసా

సీపీఎస్‌తో పోలిస్తే మరింత మెరుగ్గా జీపీఎస్

- రిటైర్‌మెంట్ తర్వాత చివరి నెల బేసిక్‌లో 50 శాతం మొత్తం పెన్షన్‌తోపాటు ఏటా 2 డీఆర్‌లు
- త్వరలో 12వ పీఆర్సీ ఏర్పాటు
- 10వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- 6,840 కొత్త పోస్టుల మంజూరు
- ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ విలీనం
- మంత్రివర్గ సమావేశం అనంతరం మీడియాకు వెల్లడించిన మంత్రి వేణుగోపాలకృష్ణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో శాశ్వత, కాంట్రాక్టు, సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ అందించేలా గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)ను రూపొందించింది. దీనిద్వారా ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక భద్రత చేకూరనుంది. రిటైర్ అయిన ఉద్యోగి చివరి నెల మూలవేతనంలో 50 శాతం పెన్షన్, ప్రతి ఆర్నెల్లకు ఒకసారి కరువు భృతి (డీఆర్) ఇవ్వడం ద్వారా మెరుగైన పెన్షన్‌ను అందించనుంది. దీంతోపాటు ఉద్యోగులు అడగకుండానే 12వ పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటుతోపాటు 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ లాంటి కీలక అంశాలకు బుధవారం సచివాలయంలో సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మీడియాకు వివరాలు వెల్లడించారు. మాటప్రకారం సీఎం జగన్ కాంట్రాక్టు ఉద్యోగుల దశాబ్దాల కలను నెరవేర్చారని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జీపీఎస్‌ను తీర్చిదిద్దినట్లు వివరించారు. రిటైర్డ్ ఉద్యోగులకు పూర్తి భద్రతనిచ్చేలా రూపొందించిన జీపీఎస్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రి వేణు ఇంకా ఏమన్నారంటే..

జీపీఎస్‌తో గ్యారంటీ ఇలా..

సీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్ విధానం ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్‌కు పూర్తి గ్యారంటీ ఇస్తుంది. ఇందులోనూ సీపీఎస్‌లో చెల్లించినట్లే ఉద్యోగి 10 శాతం పెన్షన్ వాటాగా చెల్లిస్తే ప్రభుత్వం కూడా అంతే కడుతుంది. ఉద్యోగ విరమణ సమయంలో చివరి జీతంలో బేసిక్‌లో 50 శాతం పెన్షన్‌గా అందుతుంది. ఇక్కడ సీపీఎస్‌తో పోలిస్తే పెన్షన్ 150 శాతం అధికంగా ఉంటుంది. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతి ఆర్నెల్లకు ఒకసారి ప్రకటించే డీఏలను పరిగణనలోకి



తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రెండు డీఆర్‌లు ఇస్తుంది. ఉదాహరణకు రిటైరైన ఉద్యోగి చివరి నెల బేసిక్ జీతం రూ.లక్ష ఉంటే అందులో రూ.50 వేలు పెన్షన్‌గా వస్తుంది. ఏడాదికి రెండు డీఆర్‌లతో కలుపుకొని ఇది ఏటా పెరుగుతుంది. 62 ఏళ్లకు రిటైర్ అయ్యే వ్యక్తి మరో ఇరవై ఏళ్ల తర్వాత అంటే 82 ఏళ్ల వయసులో జీపీఎస్ ద్వారా రూ.1,10,000 పెన్షన్‌గా తీసుకుంటారు. తద్వారా రిటైర్డ్ ఉద్యోగి జీవన ప్రమాణాలను కాపాడినట్లు అవుతుంది. సీపీఎస్‌లో ఇలాంటి వెసులుబాటు లేదు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇది 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీసు ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందరికీ వర్తిస్తుంది. కటాఫ్ తేదీకి 10 ఏళ్లు ఉండాలని అధికారులు సిఫార్సు చేస్తే సీఎం జగన్ ఐదేళ్లకు తగ్గించారు. జిల్లాల పునర్విభజన తర్వాత కొత్త జిల్లాల్లోనూ ఒకేలా హెచ్ఆర్ఏ ఉండేందుకు అన్ని జిల్లా కేంద్రాల్లో 16% హెచ్ఆర్ఏ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. 2022 జనవరి 1వతేదీ నుంచి డీఏ, డీఆర్ 2.73 శాతం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదించింది. దీనివల్ల ప్రభుత్వంపై నెలకు రూ.200 కోట్ల అదనపు భారం పడనుంది.

6,840 కొత్త పోస్టుల మంజూరు

నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెచ్చింది. వివిధ శాఖల్లో సుమారు 6,840 కొత్త పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదించింది. వీటిల్లో 3,920 రిజర్వ్ పోలీసు ఉద్యోగాలు సహా నూతన వైద్య కళాశాలలు, పలు విద్యా సంస్థల్లో భారీ ఎత్తున కొత్త పోస్టులను కల్పించింది. ఏపీ వైద్య విధాన పరిషత్ 1986 యాక్ట్‌ను రద్దు చేసి 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్' శాఖగా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయడానికి వీలుగా చట్ట సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వైద్య విధాన పరిషత్ స్వయం ప్రతిపత్తి నుంచి ప్రభుత్వంలోకి మారడం ద్వారా 14,658 మంది ఉద్యోగులకు మేలు జరుగుతుంది. వీరికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే 010 పద్దు కింద వేతనాలను చెల్లించనుంది.

డ్రంకెన్ డ్రైవ్‌కు భయపడి..

రాంగ్‌రూట్లో వెళ్లిన యువకుడు

- ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతి
- కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఘటన.. స్థానికుల రాస్తారోకో


శ్రీనివాస్(ఫైల్)

కరీంనగర్ క్రైం: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి భయపడి ఓ యువకుడు.. బైక్ వెనక్కి తిప్పి రాంగ్‌రూట్లో వేగంగా వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లాకేంద్రంలోని బైపాస్‌రోడ్డులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. జిల్లాలోని హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటకు చెందిన ఎలువాక శ్రీనివాస్(33) పదేళ్లుగా స్థానిక విద్యానగర్‌లో ఉంటూ వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. తన సోదరుడి కూతురు పుట్టినరోజు శుక్రవారం ఉండడంతో బుధవారం రాత్రి పనులు పూర్తిచేసుకుని బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. నగరంలోని కోతిరాంపూర్ చౌరస్తా నుంచి బద్దంఎల్లారెడ్డి చౌరస్తా వైపు వెళ్తున్నాడు. అక్కడ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. గమనించిన శ్రీనివాస్ బైక్‌ను వెనక్కి తిప్పాడు. పోలీసులు సైతం శ్రీనివాస్‌ను గమనించి అతడు వెనక్కి వెళ్లకుండా ఆపేందుకు యత్నించారు. ఇంతలో బైక్‌ను వేగంగా నడిపిన శ్రీనివాస్ ఎదురుగా వస్తున్న హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొని అక్కడికక్కడే మరణించాడు.

స్థానికుల ఆందోళన

ఘటనను గమనించిన స్థానికులు పోలీసులపై మండిపడ్డారు. పెద్దఎత్తున గూమికూడి బద్దం ఎల్లారెడ్డి చౌరస్తా సమీపంలో రోడ్డుపై అరగంటపాటు ఆందోళనకు దిగారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల కారణంగానే శ్రీనివాస్ మృతిచెందాడని ఆరోపించారు. ట్రాఫిక్ జాం కావడంతో పోలీసు అధికారులు ఘటనాస్థలానికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. శ్రీనివాస్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కల్తీ కల్లు అమ్మిన వ్యక్తికి పదేళ్ల జైలు

మనోహరాబాద్(తూప్రాన్): కల్తీ కల్లు అమ్మిన వ్యక్తికి మెదక్ కోర్టు 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. బుధవారం నర్సాపూర్ ఎక్సైజ్ సీఐ పద్మ ఈ కేసు వివరాలు వెల్లడించారు. 2016లో మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలోని కల్లు దుకాణంలో తనిఖీలు నిర్వహించి కల్లు శాంపిల్‌ను నిజామాబాద్‌కు పంపగా అందులో నిషేధిత ఆల్ప్రాజోలం అనే మత్తు పదార్థం ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీనిపై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం ఈ ఘటనతో సంబంధమున్న నర్సాగౌడ్ అనే వ్యక్తికి మెదక్ అడిషనల్ జడ్జి లక్ష్మీశారద పదేళ్ల జైలు శిక్షతోపాటు లక్ష రూపాయల జరిమానా విధించించారు. తీర్పు తర్వాత నర్సాగౌడ్‌ను ఎక్సైజ్ పోలీసులు సంగారెడ్డి జైలుకు తరలించారు.

ధనవంతుల కోసమే ధరణి: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ధనిక రైతుల కోసమే ధరణి పోర్టల్ ఉపయోగపడుతోందని మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు విమర్శించారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ సభలో సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ గురించి చాలా దృఢమైన వ్యాఖ్యలు చేశారని, ఆయన ప్రజల నుంచి నేరుగా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుండేదని చెప్పారు. గతంలో పేదలకు పంపిణీ చేసిన భూములపై ధరణి పోర్టల్ ద్వారా అప్పటి యజమానులు హక్కులు పొందుతున్నారని చెప్పారు.

మా రూటే సెప'రేటు'!

▶ మొదటి పేజీ తరువాయి

బ్రోకెన్ రైస్ ఉంటే ఎఫ్‌సీఐ తీసుకోదని.. బ్రోకెన్ తక్కువగా వచ్చే జిల్లాల నుంచి ధాన్యం తెచ్చి పెట్టేలా వెసులుబాటు ఇవ్వాలంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖను కోరాలని వారికి సూచించడమే కాకుండా.. అన్నీ తామై చక్కదిద్దారు. అనుమతి రాగానే యాదాద్రి జిల్లా నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకునేలా మిల్లర్ల సంఘానికి చెందిన ఓ రాష్ట్ర స్థాయి నేతతో కుమ్మక్కయ్యారు.

డబ్బులు చెల్లించిన వారెవరంటే..

అయిజకు చెందిన దేవుడి పేరిట ఉన్న రెండు మిల్లుల యజమానులు సుమారు 35 ఏసీకేలు, గద్వాల ప్రాంతంలో బీరెల్లికి వెళ్లే రహదారి మార్గంలోని రెండు మిల్లుల యజమానులు సుమారు 20 ఏసీకేలు, జమ్ములమ్మ దేవాలయం ప్రాంతంలోని ఓ మిల్లు యజమాని సుమారు 8 ఏసీకేలు, కేటీదొడ్డి మండల పరిధిలో ఉన్న ఓ మిల్లు యజమాని 15 ఏసీకేలు, ఇటిక్యాల మండలం బీచుపల్లి పరిసర ప్రాంతంలోని ఓ మిల్లు యజమాని 25 ఏసీకేలకు సంబంధించిన డబ్బులను యాదాద్రి జిల్లాలోని రైస్ మిల్లు సంఘం రాష్ట్ర నాయకుడి ఖాతాలో జమ చేసినట్లు సమాచారం. దీనిపై గద్వాల జిల్లా డీసీఎస్ఓ రేవతిని సంప్రదించగా.. డబ్బులు తీసుకుంటున్నట్లు వచ్చిన ఆరోపణలు వాస్తవం కాదన్నారు.

విచారణకు శైలజ కిరణ్ సహకరించలేదు

పదే పదే ఆటంకాలు కల్పించారు

- ప్రశ్నించే అధికారులను అడ్డుకునేందుకు మార్గదర్శి సిబ్బంది ప్రయత్నించారు..
- 25% విచారణ కూడా పూర్తి కాలేదు.. చట్టానికి లోబడే మార్గదర్శి కేసు విచారణ
- శైలజతోపాటు రామోజీని మరోసారి విచారిస్తాం
- త్వరలో మార్గదర్శి నిధుల ఆటాచ్‌మెంట్ కోసం పిటిషన్
- చందాదారుల ప్రయోజనాల పరిరక్షణకే నిధుల అటాచ్‌మెంట్
- సీఐడీ అదనపు ఎస్పీ రవికుమార్

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో నిందితులుగా ఉన్న చెరుకూరి రామోజీరావు, శైలజ కిరణ్ విచారణకు ఏమాత్రం సహకరించడంలేదని, అయినప్పటికీ తాము చట్టానికి లోబడే విచారణ జరుపుతున్నామని సీఐడీ అదనపు ఎస్పీ రవికుమార్ స్పష్టం చేశారు. ఈనాడు, ఈటీవీ మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగానే సీఐడీ విచారణపై నిరాధార ఆరోపణలతో తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఆయన బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఐడీ ఐజీ సీహెచ్ శ్రీకాంత్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాము శైలజ కిరణ్‌ను ఎలాంటి వేధింపులకు గురిచేయలేదని, ఆమె పట్ల పూర్తి మర్యాదతో వ్యవహరించామని చెప్పారు. ఆమె భోజనం, టీ, మందుల కోసం అవసరమైన ప్రతిసారీ అవకాశం కల్పించామన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడినట్టు కచ్చితమైన ఆధారాలు లభించాయని రవికుమార్ స్పష్టం చేశారు. విచారణ కోసం మంగళవారం శైలజ కిరణ్ నివాసానికి వెళ్లినప్పుడు తమ సిబ్బందిలోని 10 మందిని అనుమతించకుండా అభ్యంతరం తెలిపారన్నారు. ఆర్థిక అక్రమాలను సంబంధించి ఆధారాలపై ప్రశ్నించాల్సిన సాంకేతిక అధికారులను అడ్డుకునేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బంది ప్రయత్నించారని తెలిపారు. తాము చట్టం పరిధిలోనే విచారిస్తున్నప్పటికీ శైలజ కిరణ్ విచారణకు ఏమాత్రం సహకరించకుండా పదే పదే ఆటంకాలు కల్పించేందుకు యత్నించారని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీగా పూర్తి సమాచారాన్ని ఆమె వద్ద ఉంచుకోలేదని, ఇది ఉద్దేశపూర్వకంగానే చేశారని తెలిపారు. ఎండీ వద్ద పూర్తి సమాచారం ఉండాల్సిన అవసరం లేదని కూడా ఆమె వ్యాఖ్యానించారని చెప్పారు. చట్టానికి విరుద్ధంగా నిధుల మళ్లింపుపై వాస్తవాలను కప్పిపుచ్చేందుకు ఆమె పదే పదే ప్రయత్నించారన్నారు. విచారించిన ప్రతిసారీ ఏదో సాకుతో తప్పించుకోవాలన్నదే ఆమె ఉద్దేశంగా ఉందన్నారు. శైలజ కిరణ్ పదే పదే ఆటంకాలు కల్పిస్తుండటంతో తాము అడగాల్సిన ప్రశ్నల్లో 25 శాతం కూడా అడగలేకపోయామని వివరించారు. అందుకే మరోసారి నోటీసులు జారీ చేసి ఆమెను విచారిస్తామని తెలిపారు. ఈ కేసులో రామోజీరావును కూడా మరోసారి విచారిస్తామని చెప్పారు. చందాదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులు రూ.793.50 కోట్లను ఆటాచ్ చేసేందుకు న్యాయస్థానంలో త్వరలోనే పిటిషన్ దాఖలు చేస్తామని ఆయన తెలిపారు.


మీడియాతో మాట్లాడుతున్న సీఐడీ అధికారులు రవికుమార్, శ్రీకాంత్

జిల్లా వార్తలు

కార్మికుల పీఎఫ్ లెక్కలు ఎప్పటికప్పుడు తెలపాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పర్మనెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ లెక్కల వివరాలు ఎప్పటికప్పుడు వెల్లడించాలని, అందుకోసం మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. రామగుండంలో బుధవారం జరిగిన సీఎంపీఎఫ్ సమావేశంలో సింగరేణి, సీఎంపీఎఫ్ అధికారులతో పాటు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి పర్మనెంట్ కార్మికుల సమస్యలతో పాటు కాంట్రాక్ట్ మారిన ప్పుడల్లా కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు సీఎంపీఎఫ్ కమిషనర్ మిశ్రా దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు మందా నర్సింహారావు మాట్లాడుతూ ఎన్ని మస్టర్లు చేసినా 26 మస్టర్ల వేతనాలను రికవరీ చేయటంతో కార్మికులకు సరిపడా వేతనాలు అందడం లేదని చెప్పారు. ఈ మేరకు యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి, అవసరమైన వారికి రుణాలు మంజూరు చేసి ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్, జీఎంలు చింతల శ్రీనివాస్, కుమార్‌రెడ్డి, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

11న ప్రజాగర్జన

విజయవంతం చేయాలని కూనంనేని పిలుపు


మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఈనెల 11న జరిగే ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన హమాలీ, ఆటో, కారు, తాపీ కార్మికులు, రైతుబజార్, కూరగాయలు, పండ్ల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కష్టజీవులకు, కర్షకులకు పేద వర్గాల వారికి నివాస గృహాలతో పాటు పిల్లలకు ఉచిత విద్య, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఉందన్నారు. శ్రమజీవుల పక్షాన నిలిచి పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని, ఓడినా, గెలిచినా ప్రజల మధ్య ఉండేది కమ్యూనిస్టులేనని చెప్పారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబిర్‌పాషా, నాయకులు గుత్తుల సత్యనారాయణ, వై.శ్రీనివాస్‌రెడ్డి, మాచర్ల శ్రీను, కంచర్ల జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల గోడు పట్టదా..?

- మంజూరై ఎనిమిదేళ్లయినా పక్కా భవనాల్లేవు
- అద్దె భవనాలూ లేక ఇతర ప్రాంతాల్లో నిర్వహణ
- శాఖల మధ్య కొరవడుతున్న సమన్వయం
- ప్రభుత్వ ఆదేశాలనూ పట్టించుకోని వైనం


ఇల్లెందులో దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉంటున్న అటవీశాఖ ట్రైనింగ్ స్కూల్ హాస్టల్ భవనం

ఇల్లెందురూరల్: పట్టణమైనా.. పల్లె అయినా స్థానికంగా మెరుగైన విద్యాసంస్థలు ఉంటేనే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. స్థానిక విద్యార్థులు ఆయా సంస్థల్లో చేరడానికి ఆసక్తి చూపుతారు. విద్యాసంస్థల వల్ల వ్యాపారాలు సైతం వృద్ధి చెందుతాయి. ఎంతోమందికి ఉపాధి కలుగుతుంది. ఈ క్రమంలో ప్రతి విద్యార్థికి కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2016 నుంచి విరివిగా గురుకులాలు మంజూరు చేస్తోంది. అయితే సొంత భవనాలు లేక కొన్నింటిని అద్దె భవనాల్లో నిర్వహిస్తుండగా.. మరికొన్ని చోట్ల అద్దె భవనాలు కూడా అందుబాటులో లేక ఇతర పట్టణాల్లో నిర్వహిస్తున్నారు. మంజూరైన చోటే గురుకులాలు నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశంతో ఉన్నతాధికారులలో కొంత కదలిక వచ్చింది.. కానీ విద్యాసంవత్సరం ప్రారంభానికి గడువు సమీపిస్తున్నా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు మాత్రం లేవు.

ఉమ్మడి జిల్లాలో 65 గురుకులాలు

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం 2016లో మైనారిటీ, బీసీ, ఎస్సీ వర్గాల పేరిట ప్రత్యేకంగా గురుకులాలు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలో మైనారిటీ గురుకులాలు 17, సాంఘిక సంక్షేమ గురుకులాలు 23, బీసీ గురుకులాలు 25 ఉన్నాయి.

స్థానికంగా ఉంటేనే ప్రయోజనం

ఒక్కో గురుకులంలో 500కు మించి విద్యార్థులు చదువుతుంటారు. ఇందులో స్థానికులే ఎక్కువ మంది ఉండే అవకాశం ఉంటుంది. మంజూరైన చోటే పాఠశాల నిర్వహిస్తే అటు విద్యార్థులకు, ఇటు తల్లిదండ్రులకు ఉపయోగంగా ఉంటుంది. తమ పిల్లవాడి ప్రతిభ, యోగక్షేమాలను ఎప్పటికప్పుడు పరిశీలించే వెసులుబాటు కలుగుతుంది. ఎక్కడ మంజూరైన గురుకులాన్ని అక్కడే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినా గురుకులాల సొసైటీలు శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా అందులో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు సౌకర్యాల పేరుతో తమకు అనుకూలంగా ఉండే ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం కూడా తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో ఇదే ఆరోపణ చేసింది. ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభానికి సమయం దగ్గర పడుతున్నా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కేటాయించిన ప్రాంతాలకు గురుకులాలను తరలించే ప్రయత్నం జరగడం లేదని తల్లిదండ్రులు, విద్యార్థులు అంటున్నారు.

సమన్వయ లోపమే కారణమా..

స్థానికంగా గురుకులాల నిర్వహణకు అనువుగా భవనాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపించడం, స్థానికంగా ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను విస్మరించడం వంటి కారణాలతోనే గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోంది. ఉదాహరణకు ఇల్లెందులో అటవీ, సింగరేణి, సాంఘిక సంక్షేమ శాఖలకు చెందిన భవనాలు ఖాళీగా ఉన్నా.. ఇక్కడికి కేటాయించిన రెండు గురుకులాలను ఇతర మండలాల్లో నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడమే కారణమని తెలుస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏ మండలంలో మంజూరైన గురుకులాలు అదే మండలంలో నిర్వహించాలన్న ప్రభుత్వ తాజా ఆదేశంతోనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందిస్తారో లేదో వేచిచూడాల్సిందే.

భవనాలు లేక మరోచోట..

మంజూరైన ప్రాంతంలోనే గురుకులాలు నిర్వహిస్తే స్థానిక విద్యార్థులకు కొంత మేర ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ అద్దె భవనాలు కూడా అందుబాటులో లేకపోవడంతో ఇతర పట్టణాలు, మండలాల్లో వాటిని నిర్వహిస్తున్నారు. ఇలా ఖమ్మం, వైరా, నేలకొండపల్లి మండలాల్లో మంజూరైన మైనారిటీ గురుకులాలు, తిరుమలాయపాలెం, ముదిగొండ, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు మండలాల్లో మంజూరైన సాంఘిక సంక్షేమ గురుకులాలు, ఇల్లెందు, చెరువుమాధారం బీసీ గురుకులాలు ప్రస్తుతం ఇతర మండలాల్లో కొనసాగుతున్నాయి.

స్థానికంగానే నిర్వహించాలి



మంజూరైన చోటే గురుకులాలు నిర్వహిస్తే విద్యార్థులకు ఇంటి వద్దే ఉన్నామన్న భావన కలుగుతుంది. చదువుపై దృష్టి సారించే అవకాశం ఏర్పడుతుంది. తల్లిదండ్రులు కూడా తరచూ వచ్చి తమ పిల్లలను చూసుకునే వెసులుబాటు కలుగుతుంది. అధికారులు తక్షణం స్పందించి ఇతర ప్రాంతాలకు తరలిపోయిన గురుకులాలను హెడ్‌క్వార్టర్‌కు మళ్లించాలి.

– అభిమన్యు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి

అందరికీ ప్రయోజనం



గురుకులాలు మంజూరైన చోటే నిర్వహిస్తే విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు స్థానికంగా వ్యాపార వర్గాలకూ ప్రయోజనం చేకూరుతుంది. ప్రతి మండలంలో ప్రభుత్వ ఖాళీ భవనాలు అందుబాటులో ఉన్నా శాఖల మధ్య సమన్వయ లోపంతో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారిస్తే స్థానికంగానే సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.

– కాంపాటి పృథ్వి, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి

కేజీబీవీ టీచర్లకు మూలవేతనం ఇప్పిస్తాం

పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల ఉపాధ్యాయులకు కనీస మూలవేతనం ఇప్పించే బాధ్యత తమదేనని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి వెల్లడించారు. ఖమ్మం జెడ్పీ సమావేశ మందిరంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మోత్కూరి మధు అధ్యక్షతన కేజీబీవీ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. ఈసమావేశంలో ముఖ్యఅతిథిగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ కేజీబీవీల్లో ఇంటర్ విద్య ప్రవేశపెట్టిన నేపథ్యాన స్పెషల్ ఆఫీసర్లపై పనిభారం పెరిగినందున కేర్ టేకర్ల పోస్టులు భర్తీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే, మోడల్ స్కూళ్లలో వసతిగృహాల బాధ్యతల నుంచి తప్పించడం, పీఈటీలు, అకౌంటెంట్లకు.. ఇతర పీఈటీలతో సమానంగా వేతనం ఇప్పించేలా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ పీఆర్సీ 30శాతం పెంపు తమ వల్లే సాధ్యమైందని గుర్తుచేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోత్కూరి మధు, ఆర్.రంగారావు మాట్లాడుతూ సీఎం అపాయింట్‌మెంట్ తీసుకుని కేజీబీవీల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ఒక సంఘం నుంచి తప్పుడు మెసేజ్‌లు వచ్చినా ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరు కావడం ఆనందంగా ఉందని తెలిపారు. కేజీబీవీల బాధ్యురాలు ఝాన్సీసౌజన్య మాట్లాడగా చిత్తలూరి ప్రసాద్, యలమద్ది వెంకటేశ్వర్లు, కట్టా శేఖర్, విజయ్, అమృత్‌కుమార్, హుస్సేన్, రెబ్బా శ్రీనివాసరావు, సుజాత, జయమ్మ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆకాంక్షల కోసం ఉద్యమించండి..


ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



ప్రదర్శనలో పాల్గొన్న పోటు రంగారావు, నాయకులు

సత్తుపల్లిటౌన్: వాగ్దానాలతో కాలం వెళ్లదీస్తూ ప్రజలను ప్రభుత్వం వంచిస్తున్న విషయాన్ని గుర్తించి అందరూ తెలంగాణ ఆకాంక్షల సాధనకు ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రజా ఆకాంక్షల దీక్షా దివాస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సత్తుపల్లిలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు పథకాలను నామమాత్రంగా అమలుచేసి రాష్ట్రమంతా బంగారు తెలంగాణగా మారిందని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. స్వరాష్ట్రంలో పోడు సాగుదారులకు కంటి మీద కునుకు లేకుండా దాడులు చేయించారని గుర్తు చేశారు. కానీ, అప్పుడు 11 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలిస్తామని చెప్పి లక్షన్నర ఎకరాలకే పట్టాలిస్తామనడం సరికాదన్నారు. తొలుత నీలం రామచంద్రయ్య భవనం నుంచి తహసీల్ వరకు ప్రదర్శనగా వెళ్లి తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోకినెపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు గంటా శ్రీను, తాటి రాజు, నాగిరెడ్డి, వెంకటేశ్, రాఘవులు, నాగప్రసాద్, నాగరాజు, నర్సమ్మ, దుర్గా, వెంకటమ్మ పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం వద్దేవద్దు..


సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌ఎల్ మూర్తి

ఖమ్మంమామిళ్లగూడెం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయాల్సిందేనని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. ఖమ్మం సుందరయ్యభవన్‌లో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో భాగంగా 'నూతన విద్యావిధానం – ప్రత్యామ్నాయ విధానాలు' అంశంపై ఆయన మాట్లాడారు. నూతన విద్యావిధానం ద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడమే కాక ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాసేలా ఉందని ఆరోపించారు. మధ్యతరగతి విద్యార్థులు చదువుకు దూరమయ్యేలా కుట్రపన్నిన కేంద్రం విధానాలను తిప్పకొడతామని తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, శ్రీకాంత్‌వర్మ, నాయకులు వీరభద్రం, మిస్రీన్ సుల్తానా, ప్రవీణ్, పర్వీన్, ప్రశాంత్, రవి, రాగిణి, సుమలత, స్రవంతి పాల్గొన్నారు.